క్లుప్తంగా

'సనాతన ధర్మంపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాల: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా భారత సురక్ష సమితి నాయకులు దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందుధర్మంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హిందు ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో భారత సురక్ష సమితి నాయకులు ఏసీఎస్ రాజు, అరవ లక్ష్మి, కాశీనాథం, పోచమల్లు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'శిథిలావస్థలోని ఇళ్లల్లో ఉండొద్దు'



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో

కథలాపూర్: భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్ అన్నారు. బుధవారం కథలాపూర్‌లోని పలు వాడల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ప్రజలు నివాసం ఉండొద్దన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య, పంచాయతీ సిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజారోగ్య సర్వే చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో గంగాధర్, కార్యదర్శి చెదలు నారాయణ, సత్తయ్య, ఇస్మాయిల్ ఉన్నారు.

మట్టి సేకరించిన బీజేపీ నాయకులు



మట్టి సేకరిస్తున్న మాజీ జెడ్పీటీసీ సునీత

ఇబ్రహీంపట్నం: నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మంగళవారం వాడ వాడలో తిరుగుతూ అమృత కలశంలో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సునీత, మండల అధ్యక్షుడు బట్టు జకరయ్య, నిజామాబాద్ పార్లమెంటరీ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, మండల ప్రధాన కార్యదర్శి రణదీర్, మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్, మండల కార్యదర్శి దేవన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'బీసీల సింహగర్జన' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేశ్ అన్నారు. ఈనెల 10న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగే బీసీల సింహగర్జనకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం దేవిశ్రీ గార్డెన్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా బీసీలందరూ అధిక సంఖ్యలో హాజరై సింహగర్జనను విజయవంతం చేయాలని, చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నాగరాజు, భూమి రమణ, జలజ పాల్గొన్నారు.

రిటైర్డ్ అధ్యాపకుడికి సన్మానం

జగిత్యాల: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు రిటైర్డ్ అధ్యాపకుడు జైశెట్టి రమణయ్యను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైశెట్టి రమణయ్య జిల్లాకే గర్వకారణమని, ఎంతో చరిత్రను ఇక్కడ రాయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వీరబత్తిని శ్రీనివాస్, కమటాల శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడేళ్లుగా ఇన్‌చార్జీల పాలనే..!



మాది మండలంలోని పైడిమడుగు.. మాకు గ్రామ కంఠంలో మా తాత పేరుమీద కొంత స్థలం ఉంది. మా నాన్న వాళ్లు నలుగురు అన్నదమ్ములు కావటంతో అది ఉమ్మడి ఆస్తి. ఆ స్థలంలో నల్లా పర్మిషన్ విషయంలో వివాదం తలెత్తటంతో కలెక్టరుకు ఫిర్యాదు చేశాం. పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవోకు కలెక్టర్ సూచించారు. ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవటం లేదు. ఆ సమస్య అలానే ఉందని వాపోయాడు పైడిమడుగుకు చెందిన తొట్ల కార్తీక్.



కోరుట్ల మండల పరిషత్ కార్యాలయం

- కోరుట్ల మండలానికి రెగ్యులర్ ఎంపీడీవో కరువు
- గ్రామాల్లో పనులు కాక స్థానికుల అవస్థలు
- కుంటుపడుతున్న అభివృద్ధి
- కార్యాలయంలో సీనియర్ల పెత్తనం

కోరుట్ల రూరల్: ఇదీ కార్తీక్ ఒక్కడి సమస్యే కాదు.. కోరుట్ల మండలానికి మూడేళ్లుగా ఇన్‌చార్జి ఎంపీడీవోలే విధులు నిర్వహిస్తుండటంతో గ్రామాల్లో చాలా పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. మండల కార్యాలయంలో పనిచేసే సూపరింటెండెంట్ లేదా మండల పంచాయతీ అధికారులకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో కార్యాలయ పనులతో పాటు గ్రామాల పర్యవేక్షణ సదరు అధికారికి భారంగా మారుతోంది. దీంతో పూర్తిస్థాయి మండల అభివృద్ధి అధికారిని నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి రోజూ గ్రామాల పర్యవేక్షణ

మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా నిత్యం ఏదో ఒక గ్రామంలో ఎంపీడీవో అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. గ్రామాల్లో హరితహారం, ఉపాధిహామీ పనులు, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు వంటి పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిఉంటుంది.

ఇన్‌చార్జిలను ప్రభావితం చేస్తున్నారు

ఇన్‌చార్జి అధికారుల కారణంగా కార్యాలయంలో గత పదేళ్లకు పైగా బదిలీ కాకుండా తిష్టవేసిన ఉద్యోగులు పెత్తనం చెలాయిస్తున్నారు. పై అధికారులను సైతం ప్రభావితం చేస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ఓ ఉద్యోగి సీనియర్ కావటంతో ఇన్‌చార్జీలు ప్రతీ పనికి ఆ ఉద్యోగిపైనే ఆధార పడుతున్నారు. దీంతో సదరు ఉద్యోగి అధికారులను ప్రభావితం చేస్తూ కార్యాలయాన్ని తన గుప్పిట్లోనే ఉంచుకుని ఇతర ఉద్యోగుల విధుల్లో తల దూర్చుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. ఈజీఎస్‌లో పని చేస్తున్న ఓ కాంట్రాక్ట్ ఆపరేటర్ సైతం ఏళ్ల తరబడి ఇక్కన్నే తిష్ట వేసి ఉండటం విమర్శలకు తావిస్తోంది. కార్యాలయ సమయపాలన పాటించకుండా విధులకు హాజరవుతున్నట్లు తెలిసింది. సదరు ఉద్యోగి గతంలో వేరే మండలానికి బదిలీ అయినప్పటికీ ఇక్కడికే బదిలీపై రావటం చర్చనీయాంశంగా మారింది.

3 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ అవార్డు..

మూడేళ్ల క్రితం పూర్తి స్థాయి ఎంపీడీవోగా ఉన్న కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండలానికి పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. అవార్డు కింద రూ. 25 లక్షలు నగదు ప్రోత్సాహం అందటంతో ఆ నిధులతో మండల పరిషత్ కార్యాలయం పై అంతస్తులో సమావేశ మందిరం నిర్మాణం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయి అధికారుల నియామకానికి కృషి చేయాలని కోరుతున్నారు.

పనులు పూర్తి కావటం లేదు



మూడేళ్లుగా ఇన్‌చార్జి ఎంపీడీవోల కారణంగా గ్రామంలో పనులు సరిగా కావటం లేదు. పర్యవేక్షణ సరిగా లేక పోవటంతో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. హరితహారం ఉపాధిహామీ వంటి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తి స్థాయి అధికారిని నియమిస్తే బాగుంటుంది.

గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, సర్పంచ్ యూసుఫ్‌నగర్

భారంగా అదనపు బాధ్యతలు



మండల కార్యాలయాల్లో విధులు నిర్వహించే సూపరింటెండెంట్ లేదా ఎంపీవోలకు ఎంపీడీఓలుగా ఇస్తున్న అదనపు బాధ్యతలు అధికారులకు భారంగా మారుతున్నాయి. దీంతో వాళ్ల విధులతో పాటు ఎంపీడీవో విధులు కూడా మోయటం ఇబ్బందిగానే ఉంటుంది. ఎవరి పనులు వారు చేస్తేనే పూర్తిస్థాయిలో పనులు జరుగుతాయి.

– పంచిరి విజయ్ కుమార్, ఎంపీటీసీ, చిన్నమెట్‌పల్లి

బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: రాష్ట్రాన్ని ఆగం చేసేందుకు యత్నిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సుమారు 100 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 70లక్షల సభ్యత్వమున్న బీఆర్‌ఎస్‌ను ఓడించే శక్తి కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ చేతుల్లో పెడుతున్నానని, సంజయ్‌ను ఆశీర్వదించాలని కోరారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి సాటి లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు లింగస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి..

ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మల్లాపూర్‌లో రూ.3 లక్షల నిధులతో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్, ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామానికి చెందిన మద్దెనపల్లి మణికంఠకు చికిత్స కోసం రూ.70 వేల ఎల్‌వోసీ మంగళవారం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల: పట్టణంలోని శ్రీమార్కండేయ ఆలయంలో మంగళవారం అమ్మవారికి కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘ నాయకులు, మహిళా భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో భక్తులకు అన్నదానం

కోరుట్ల: పట్టణ శివారులోని ఏసికోని గుట్ట వద్ద హనుమాన్ ఆలయంలో మంగళవారం శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి, సింగిల్‌విండో చైర్మన్ ఎలిశెట్టి భూమారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి



వేడుకల్లో చిన్నారుల సందడి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని గ్రావిటి హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, కృష్ణుడు వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ సంధ్యారాణి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా?



మాట్లాడుతున్న అశోక్

మల్లాపూర్: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా? అని వీవీరావుపేట గల్ఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెనుకుల అశోక్ అన్నారు. మండలంలోని వీవీరావుపేటలో మంగళవారం గల్ఫ్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ యువత ఉన్న ఊరిలో పనిలేక ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వలసజీవుల వెతలు తీరాలంటే ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ గల్ఫ్ కార్మికులని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఆర్ఐ పాలసీపై విధాన నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని, గల్ఫ్‌లో చనిపోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న 16 లక్షల మంది కార్మికుల కుటుంబాలతో కలిసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి మా సమస్యలపై మేమే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు రఘు, రాజేశం, పన్నాల శీను, భూమేష్, మీనుగు రాధాకృష్ణ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

మేడిపెల్లి: భీమారం మండలం వెంకట్రావుపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఎరువుల గోదాం నిర్మాణానికి రూ. 4 లక్షల సీడీపీ నిధులు మంజూరైనట్లు భీమారం పీఏసీఎస్ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రమేశ్ బాబుకు, సహకరించిన జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావుకి కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం..

ఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్

కోరుట్ల రూరల్: తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోరుట్ల పట్టణానికి చెందిన చెట్టుపెల్లి లక్ష్మణ్‌ను నియమిస్తూ జాతీయ ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చెట్టుపెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు మందకృష్ణ మాదిగ, తిప్పారపు లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ధర్మపురి అసెంబ్లీ మహిళా కన్వీనర్‌గా అంజలి

గొల్లపల్లి: బీజేపీ ధర్మపురి అసెంబ్లీ మహిళా కన్వీనర్‌గా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లికి చెందిన సింగ్ అంజలిని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తన నియమకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గణేశ భక్త సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సురేశ్

రాయికల్: గణేశ భక్త సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాయికల్ పట్టణానికి చెందిన గంగదరి సురేశ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు జైని కుమార చారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు.

లోక్ అదాలత్‌పై పోలీసుల అవగాహన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

పెగడపల్లి: లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసులు రాజీతో సత్వరం పరిష్కరించుకోవచ్చని ఎస్సై సతీశ్ అన్నారు. ఈ నెల 9న జగిత్యాల కోర్టులో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌పై మండలంలోని సుద్దపల్లి, బతికపల్లి, రాజరాంపల్లి, కీచులాటపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో ఆయా గ్రామాల్లో కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పంతాలు, పట్టింపులకు పోకుండా ఉభయ పార్టీలు రాజీ కుదుర్చుకొని ఏళ్ల తరబడి ఉన్న దీర్ఘకాలిక కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కరుణాకర్ రెడ్డి, సత్తమ్మ, హారిక, స్వప్న, శోభారాణి, అంజమ్మ, ఎంపీటీసీలు రవి, రజిత, అనసూర్య, విజయలక్ష్మి, అంజయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానించిన నరేందర్‌రెడ్డి ,



సర్వేపల్లి చిత్రపటానికి ఉపాధ్యాయుల నివాళి



ఉపాధ్యాయులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు,



కోరుట్లలో ఉపాధ్యాయులుగా విద్యార్థినులు

జగిత్యాల/ జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/ ధర్మపురి /రాయికల్/ ఇబ్రహీంపట్నం/మల్యాల/ పెగడపల్లి/కథలాపూర్/ సారంగాపూర్/మల్లాపూర్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లిరూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి అన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ తండాలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ తేజస్విని, ఏఎన్ఎం ప్రియదర్శిని, సూపర్‌వైజర్ ప్రభావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఓటు హక్కు వినియోగించుకుందాం'

సారంగాపూర్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొంక వేణు, తహసీల్దార్ తఫాజుల్లా హుస్సేన్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఓటు నమోదు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లైశెట్టి శేఖర్, బీఎల్‌వో న్యారబోయిన సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి

జగిత్యాల: గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఖిలాగడ్డలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం వల్ల రోగ నిరోధక వ్యవస్థ మెరుగు అవుతుందని, ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాణి, స్వరూప, పోషణ్ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో పోషకాహార వారోత్సవాలు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ రాధ ఆదిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతమ్మ, సుజాత, అనురాధ, కవిత, బుజ్జమ్మ పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

మల్లాపూర్: రక్తదానం.. మహాదానమని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని లయన్స్‌క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ దేవ మల్లయ్య అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లోని అద్వైత హస్పిటల్‌లో నిర్వహించిన లయన్స్‌క్లబ్ మెగా రక్తదాన శిబిరాన్ని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, లయన్స్‌క్లబ్ బృందంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రోగులకు అత్యవసర పరిస్థితులలో రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతల సేవలు అముల్యమైనవని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రిజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, అధ్యక్షుడు కనుక సంజీవ్, మాజీ అధ్యక్షుడు సాదుల్ల వెంకటస్వామి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రమేశ్, ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మంది బీసీలకు కులవృత్తుల సాయం ఒకొక్కరికి రూ. 1 లక్ష చొప్పున చెక్కులు అందించినట్లు ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య బుధవారం తెలిపారు. చింతకుంటలో అంబేడ్కర్ మాదిగ సంఘం భవనానికి రూ.3 లక్షల ప్రొసీడింగ్ కాపీ అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, వైస్ చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

ధర్మపురి: మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొల్లపెల్లి గణేశ్ దాతల సహకారంతో సుమారు 20 వేల రూ.ల విలువ గల దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపెల్లి లక్ష్మి, హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, దాతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మెట్‌పల్లి: తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు కోదండరాం జన్మదిన వేడుకలను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డితో పాటు నాయకులు పసునూరి శ్రీనివాస్, కంతి రమేశ్, గూడ రాజిరెడ్డి, వన్నెల శశి, మ్యాన సతీష్ తదితరులున్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నికల కోలాహలం

మెట్‌పల్లి: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఎన్నికల కోలాహలం నెలకొంది. ఈ నెల 12న ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా మంగళవారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అధ్యక్ష పదవికి మైలారపు రాము, దొమ్మాటి ప్రవీణ్, మంత్రి గంగాధర్ నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు మంచాల రవీందర్, కంటాల మధుచందర్ తెలిపారు. అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న రాము భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. కార్యక్రమంలో మైలారపు లింబాద్రి పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్: ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. మంగళవారం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ ఆశలకు రూ.28వేలు ఇవ్వాలని, ప్రతీ ఏడాది రెండు జతల యూనిఫాంతో పాటు బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.